క్లుప్తంగా

కోరుట్లలో స్వచ్ఛత మషాల్ మార్చ్ ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కోరుట్ల: స్వచ్ఛోత్సవ్‌-2023లో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛత మషాల్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య, కమిషనర్ అయాజ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షిక వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ధర్మపురి: ధర్మపురిలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటిక పోటీలు ఆకట్టుకున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ మండల విద్యాధికారి బత్తుల భూమయ్య, హెచ్‌ఎం రాజన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరుతూ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం ఇంటర్ కళాశాలలకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వాసవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

సారంగాపూర్: రైతుల తాము తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తేనే సంఘం అభివృద్ధి చెందుతుందని ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం బీర్‌పూర్ మండల కేంద్రంలో బీర్‌పూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మసర్తి రమేశ్, ధర్మపురి కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ సుద్దాల శ్రీనివాస్, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప, సంఘం సీఈవో అయ్యోరి తిరుపతి, ఉపాధ్యక్షుడు వూరడి కొమురెల్లి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మేరుగు రాజేశం పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీని సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

మల్లాపూర్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీని సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని పీసీసీ డెలిగేట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని మొగిలిపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఫిషర్మెన్ కమిటీ మండల అధ్యక్షుడిగా నియామకమైన రొడ్డ రాజుకు నియామకపత్రం అందించారు. ఉమ్మడి జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ కల్లెడ గంగాధర్, నాయకులు ఎండీ.రజాక్, ఇప్పపెల్లి గణేశ్, ఎనడ్ల రాములు పాల్గొన్నారు.

పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత

జగిత్యాల: పచ్చదనం, పరిశుభ్రత అందరి బాధ్యత అని ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు తిరుపతి, డాక్టర్ హర్జీత్‌కౌర్, కిరణ్మయి పాల్గొన్నారు.

వైకుంఠరథం బహూకరణ



వైకుంఠ రథం అందజేస్తున్న దాతలు

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో వైకుంఠ రథాన్ని బుధవారం ఎంపీపీ తోట నారాయణ ప్రారంభించారు. ఈ రథాన్ని కోరుట్లకు చెందిన కొత్త సురేశ్, కొత్త సుధీర్ అన్నదమ్ములు తమ తల్లిదండ్రులు కొత్త వైకుంఠం–సరోజన జ్ఞాపకార్థం బహూకరించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శారద–లింగారెడ్డి, ఉపసర్పంచ్ ముస్తఫా, తోటరాజు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊర చెరువు.. నీటి కరువు

- ఎస్సారెస్పీ కాలువ అనుసంధానం చేసినా.. నిండని వైనం
- పైపుల పరిమాణం పెంచాలని రేచపల్లి రైతులు, మత్స్యకారుల విన్నపం



రేచపల్లి ఊర చెరువు

సారంగాపూర్: మండలంలోని అతి పెద్ద గ్రామం రేచపల్లి. రేచపల్లి గ్రామానికి ఆనుకుని నూతనంగా ఏర్పాటు చేసిన మ్యాడారంతండా, భీంరెడ్డిగూడెం, లచ్చనాయక్ తండా గ్రామాలు ఉన్నాయి. ఈ నాలుగు గ్రామాలకు ప్రధాన నీటి వనరులు రేచపల్లి గ్రామ శివారుల్లోని ఊరచెరువు. దీని కింద 500 ఎకరాల పంటలు సాగువుతాయి. దీంతో పాటు ఈ చెరువులో చేపలు పెంచుకుని దాదాపు 200 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయి. చెరువు శిఖం (చెరువు విస్తీర్ణం) 250 ఎకరాలు ఉంటుంది.

మిషన్ కాకతీయలో రూ.33లక్షలతో పనులు..

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ కింద రెండో విడతలో 2016–17లో రూ.33లక్షలతో చెరువు అభివృద్ధి కోసం నిధులు ఖర్చు చేసింది. చెరువులో పూడిక తీయడం, మత్తడికి, తూముకు మరమ్మతు నిర్వహించడమే కాకుండా, కట్ట నిర్మాణాలు కోతకు గురికాకుండా రాళ్లతో అడ్డడం పనులు పూర్తి చేశారు.

ఊరచెరువులోకి ఎస్సారెస్పీ నీరు..

రేచపల్లి చెరువును శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటితో నింపాలని రైతులు 20ఏళ్ల కింద కోరారు. దీంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని డి–53, 12ఎల్ కాలువకు రెండు వేర్వేరు పైపులను (ఒక్క పైపు 12 ఇంచుల సామర్థ్యం) ఏర్పాటు చేశారు. కానీ ఆశించిన మేరకు ఎస్సారెస్పీ నీరు చెరువులోకి రావడం లేదు. ప్రస్తుతం చెరువు కింద సాగు విస్తీర్ణం భారీగా పెరగడంతో దిగువన ఉన్న రైతులకు సాగునీరు అందడం కష్టంగా మారింది. దీంతో పాటు చేపలు పెంచుకునే మత్స్యకారులకు ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

పైపుల సామర్థ్యం పెంచితేనే ప్రయోజనం..

చెరువులోకి ఎస్సారెస్పీ నీరు ఎక్కువ మొత్తంలో రావడానికి 12ఎల్ కాలువకు ప్రస్తుతం ఉన్న పైపులను తొలగించి రెండు పైపులు రెండు అడుగుల చొప్పునవి (ఒక్కొక్క పైపు 24 ఇంచులవి) ఏర్పాటు చేస్తే చెరువులోకి ఆశించిన స్థాయిలో నీరు చేరుతుంది. అప్పుడు ఏడాది పొడవునా నీరు ఉంటుందని, అటు రైతులకు, ఇటు మత్స్యకారులకు సమస్య తొలగిపోతుందని ఆయా గ్రామాల రైతులు, మత్స్యకారులు పేర్కొంటున్నారు. కాగా దీనిపై ఇటీవల గ్రామానికి వచ్చిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు గ్రామస్తులు సమస్యను వివరించారు.

పెద్ద పైపులు ఏర్పాటు చేయాలి



చెరువులోకి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు పైపులను తొలగించి, వాటి స్థానంలో పెద్ద పైపులు ఏర్పాటు చేస్తే చెరువులోకి ఆశించిన స్థాయిలో నీరు చేరుతుంది. దీంతో పంటలకు నీరు అందుతుంది. చేప సంపద దక్కుతుంది.
– బీర మహేశ్, రైతు, రేచపల్లి

ప్రతిపాదనలు పంపిస్తాం



ఈ యాసంగి పంటలు ముగియగానే 12ఎల్ కాలువకు పైపులు పెంచే పనులపై ప్రతిపాదనలు పంపిస్తాం. దీంతో పాటు రైతుల పొలాల నుంచి నీరు వచ్చి ఈ చెరువులోనే చేరుతుంది. ఓ రైతు పొలం కోతకు గురికాకుండా 150 మీటర్ల గైడ్ వాల్ నిర్మించాల్సి ఉంది.
– చక్రూనాయక్, డీఈ, సారంగాపూర్, బీర్‌పూర్

ఎన్నికలకు సమాయత్తం కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు సమాయత్తం కావాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సూచించారు. ఈ మేరకకు పట్టణంలోని వీఆర్‌ఎం గార్డెన్‌లో బుధవారం మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీలు అసత్య ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పని చేసి వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించడానికి కృషి చేయాలన్నారు. అంతకు ముందు పలు గ్రామాలకు చెందిన వారు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే తనయుడు డాక్టర్ సంజయ్‌తో పాటు ఎంపీపీ మారు సాయిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే

కోరుట్ల: లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ అన్వర్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ అయాజ్, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశం, ముస్లిం మైనార్టీ నాయకులు నయీం, కాలిక్, నజీబోద్దీన్, ఇల్యాస్‌ఖాన్, సలీం ఫారుఖీ పాల్గొన్నారు.

చంద్రబోస్‌కు సన్మానం



సన్మానిస్తున్న మల్లేశ్

మల్లాపూర్: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని 'నాటు.. నాటు' అనే పాటతో చంద్రబోస్ తెలుగు సినిమా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పారని భారత జాగృతి యూత్ జిల్లా అధ్యక్షుడు గనవేని మల్లేశ్ కొనియాడారు. కాగ బుధవారం హైదరాబాద్‌లో చంద్రబోస్‌ను ఆయన నివాసంలో కలిసి సన్మానించారు.

కళలపై ఆసక్తి ఉండాలి



నృత్యం చేస్తున్న చిన్నారి

జగిత్యాల: ప్రతి విద్యార్థి కళలపై ఆసక్తి కలిగి ఉండాలని అల్ఫోర్స్ అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు స్థానిక అల్ఫోర్స్ పాఠశాలలో మనోహరం–2023 కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించాయి. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

జగిత్యాల: ప్రభుత్వం ఒంటిపూట సెలవులు ఇచ్చినప్పటికీ, కొన్ని ప్రైవేటు పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నాయని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలో కొన్ని పాఠశాలలు ఒంటిపూట నిర్వహించకుండా పూర్తిగా నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్, వంశీ, శివసాయిరెడ్డి, ప్రవీణ్, అరుణ్ తదితరులు ఉన్నారు.

కంటివెలుగు శిబిరం ప్రారంభం

పెగడపల్లి: మండలంలోని కీచులాటపల్లి గ్రామంలో బుధవారం కంటివెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ రాజేందర్‌రావు ప్రారంభించారు. సర్పంచ్ స్వప్న, ఎంపీవో మహేందర్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఎంపీటీసీ రవి, నందగిరి విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, ఆర్బీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కుమార్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

శిబిరాన్ని వినియోగించుకోవాలి

రాయికల్: కంటివెలుగు శిబిరాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి కోరారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కుమ్మరిపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఎంపీటీసీ దొంతి నాగరాజు, నాయకులు తాటిపాముల అంజయ్య, వొల్లెపు రాజేందర్, పావని, వెంకటేశ్వర్‌రెడ్డి, సంకె సాగర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦బీఆర్‌ఎస్ సభ్యత్వానికి రాజీనామా

జగిత్యాలరూరల్: మండలంలోని పొరండ్ల ఉపసర్పంచ్ సునీత బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు అందజేశారు.

✦తహసీల్దార్‌కు వినతి

కథలాపూర్: మండలకేంద్రంలో ఖబ్రస్తాన్ ప్రహరీకి ఆనుకొని అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను ఆపాలని కోరుతూ ముస్లిం కమిటీ సభ్యులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ నిర్మాణాలతో రోడ్డు ఇరుకుగా అవ్వుతుందని కమిటీ అధ్యక్షుడు ఎం.డీ హైదర్, సభ్యులు వినతిపత్రంలో పేర్కొన్నారు.

✦సర్పంచ్‌లు, కార్యదర్శులకు సన్మానం

బుగ్గారం: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవం ఏర్పాటు చేశారు. అవార్డులకు ఎంపికైన సర్పంచులు, కార్యదర్శులను ఎంపీపీ, జెడ్పీటీసీలు బాదినేని రాజమణి, రాజేందర్ సన్మానించారు. ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో అఫ్జల్‌మియా, వైస్ ఎంపీపీ సుచేందర్ పాల్గొన్నారు.

✦అవినీతిపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: పట్టణంలో ప్రకృతి వనాల ఏర్పాటులో అవినీతి జరిగిందని, దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. వెల్లుల్ల రోడ్‌లో ఉన్న ప్రకృతి వనాన్ని బుధవారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. దొనికెల నవీన్, సుంకేట విజయ్ ఉన్నారు.

✦జాతర ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో జరిగే శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను బుధవారం మెట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఆవిష్కరించారు.

✦సోషల్ మీడియాలో ముందుండాలి

రాయికల్: సోషల్ మీడియాలో యువత ముందుండాలని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ అన్నారు. బుధవారం అల్లీపూర్‌లో ప్రభుత్వ పథకాలపై యువతకు అవగాహన కల్పించారు. ఎంపీటీసీ విజయలక్ష్మి, సింగిల్‌విండో చైర్మన్ రాజలింగం, ఉపసర్పంచ్ సాగర్‌రావు పాల్గొన్నారు.

✦విద్యార్థుల శ్రమదానం

కోరుట్లరూరల్: మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలో కోరుట్ల డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రత్యేక ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. కాగా బుధవారం గ్రామ శివారులోని కాలభైరవ ఆలయ ప్రాంగణాన్ని విద్యార్థులు శుభ్రం చేశారు. కళాశాల పూర్వ విద్యార్థి ముత్తయ్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎంపీటీసీ పంచిరి విజయ్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ సాసాల మలికార్జున్ పాల్గొన్నారు.

✦ఎల్లమ్మతల్లి ఆలయంలో పూజలు

జగిత్యాలరూరల్: మండలంలోని సోమన్‌పల్లి, సంగంపల్లి గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎలమ్మతల్లి పట్నాల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

✦ఉపాధిహామీ పనులు పూర్తి చేయాలి

జగిత్యాలరూరల్: ఉపాధిహామీ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎంపీడీవో రాజేశ్వరి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సూపరింటెండెంట్ గంగాధర్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించాలి

కోరుట్ల: కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. కాగా బుధవారం పట్టణంలోని గడిబురుజుల ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి సీజ్ చేశారు. ఏఈఈ రాజు, పోలీస్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ

వెల్గటూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం సీపీఆర్‌పై పెగడపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నరేశ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

వాహనాల తనిఖీ

పెగడపల్లి: మండల కేంద్రంలో బుధవారం జగిత్యాల వెహికల్ ఇన్‌స్పెక్టర్ రమణ వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వారిపై కేసు నమోదు చేశారు. వ్యాన్‌తో పాటు రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. పెగడపల్లి ఏఎస్సై సత్తయ్య ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం రాయికల్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై కానిస్టేబుల్ మౌనిక అవగాహన కల్పించారు. ఏఎస్సై దేవేందర్, కానిస్టేబుల్ శ్రీకాంత్, ఎస్‌వో శోభారాణి, సైబర్ మెంటర్ అరుణ పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల కొలతల శిబిరం

ధర్మపురి: ధర్మపురిలోని న్యూ టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన ఉచిత బ్యాటరీ ట్రై సైకిళ్లు, కృత్రిమ అవయవాల కొలతల శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అలింకో సంస్థ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన దివ్యాంగులను గుర్తించి వారికి బ్యాటరీ సైకిళ్లతో పాటు వివిధ రకాల పరికరాలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. 120 మంది కొలతలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో కుసుమ, సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘం సభ్యులతో సమావేశం

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ గ్రామంలో మహిళా సంఘం సభ్యులతో ఎంపీడీవో శైలజరాణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృథా నీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించాలని సూచించారు. సర్పంచ్ డెక్క ప్రభాకర్, ఏపీవో దయాకర్ పాల్గొన్నారు.

హిందూ ఆలయాల నిర్మాణానికి పెద్దపీట




కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: హిందూ ఆలయాల నిర్మాణానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామంలో కోదండ రామాలయంలో రూ.10లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అయోధ్య, ఉప్పుమడుగు గ్రామంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీ విజేతలైన లక్ష్మీపూర్ జట్టుకు రూ.30వేల నగదును ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ సంధ్యారాణి, సర్పంచులు జీవన్‌రెడ్డి, ముత్తన్న, ఎంపీటీసీ భారతి, సింగిల్‌విండో చైర్మన్ రాజిరెడ్డి, రాజలింగం, నాయకులు తలారి రాజేశ్, దొంతి నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్, ఆదిత్య, రవి పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం కేసీఆర్

జగిత్యాలరూరల్: రైతు బాంధవుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని పొరండ్ల గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో రూ.23లక్షలతో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల నిల్వ గల గోదామును ఆయన ప్రారంభించారు. 26 మంది రైతులకు రూ.88లక్షల విలువ గల స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణ చెక్కులను పంపిణీ చేశారు. పొరండ్ల మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.36 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. రూ.15లక్షలతో చేపట్టే సీసీరోడ్డు, రూ.1.50 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. గ్రామంలోని ముగ్గురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.1.05 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఎంపీపీ రాజేంద్రప్రసాద్, సింగిల్‌విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ పాగళ్ల సంధ్యారాణి, ఎంపీటీసీ ఆరె సౌజన్య, రైతుబంధు కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, జిల్లా హెచ్‌సీపీ మెంబర్ దావ సురేశ్, నాయకులు బాల ముకుందం, గంగారెడ్డి, తిరుపతి, ఆనందరావు, దామోదర్, భూపతిరెడ్డి, హరీశ్, మధు, రవి పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల: మహిళల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని స్థానిక సెర్ప్ ఐకేపీ కార్యాలయంలో శ్రీదుర్గ మండల సమాఖ్య ఆధ్వర్యంలో రూ.16.85 లక్షలతో నిర్వహించనున్న కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా తీసుకొచ్చిన ట్రాక్టర్, వ్యవసాయ యంత్ర పరికరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మెన్నేని స్వర్ణలత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్‌విండో చైర్మన్లు మేన్నేని రాజా నర్సింగరావు, పోలు రాజేందర్, ఎంపీడీవో పద్మజ, జిల్లా అడిషనల్ డీఆర్డీవో సుధీర్ కుమార్, డీపీఎం వెంకటేశం, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు అంకం రాజేశం, పులి వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు. కొడిమ్యాల మండలానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ.13.38లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బుధవారం పంపిణీ చేశారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్రతిఒక్కరూ సహకరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

జగిత్యాల: స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు బుధవారం స్వచ్ఛ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సతీమణి రాధిక ఆధ్వర్యంలో స్వచ్ఛ ప్రతిజ్ఞతో పాటు స్వచ్ఛత మషాల్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ నరేశ్, కౌన్సిలర్లు శ్రీలత, పద్మావతి, జగదీశ్, శ్రీకాంత్, రాజ్‌కుమార్, అనిల్, నాయక్, డీఎంసీ సునీత పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు బుధవారం వార్డుల్లోని కంటి వెలుగు శిబిరాలను ఆయన పరిశీలించారు. కౌన్సిలర్ సమిండ్ల వాణి ఉన్నారు.

ధర్మపురి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ధర్మపురి: పట్టణంలో బుధవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాదులు గడ్డం సత్యనారాయణ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా అలుక వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రౌతు రాజేశ్, జాయింట్ సెక్రటరీ బందెల రమేశ్, లిటరరీ సెక్రటరీ రామడుగు రాజేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



రిజిస్ట్రేషన్ చేస్తున్న నాయకులు

జగిత్యాల: ఆయుష్మాన్ భారత్‌లో ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కౌన్సిలర్ మల్లికార్జున్ కోరారు. ఈ మేరకు బుధవారం శంకులపల్లిలోని పోచమ్మతల్లి ఆలయంలో కౌన్సిలర్ సహకారంతో రిజిస్ట్రేషన్ సేవలు అందించారు. రాజన్న, అంగన్‌వాడీ టీచర్ నీరజ పాల్గొన్నారు.

వీవీరావుపేటలో అవగాహన

మల్లాపూర్: మండలంలోని వీవీరావుపేటలో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్ అవగాహన కల్పించారు. బూత్ అధ్యక్షుడు ఏనుగు వినోద్‌రెడ్డి, మండ స్వామి, గ్రామశాఖ అధ్యక్షుడు తాటిపాముల గోవర్ధన్, నాయకులు సుదగోని శ్రీనివాస్, బండారి వెంకటేశ్, పుప్పాల మహేశ్, మొరపు జలపతి, గొల్లెన వెంకటేశ్ పాల్గొన్నారు.

కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఎన్‌ఎస్‌యూఐ రాస్తారోకో



రోడ్డుపై బైఠాయించిన నాయకులు

మెట్‌పల్లి: కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద బుధవారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను అదానీ, అంబానీలకు కట్టబెడుతూ పేద, మధ్య తరగతి ప్రజలపై నిత్యావసర సరుకుల ధరల పెంపుతో భారం మోపుతోందని విమర్శించారు. రాస్తారోకోతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింపజేశారు. నాయకులు విజయ్, పొల్కం శివ, పెంట ప్రణయ్, జెట్టి లక్ష్మణ్, దొమ్మాటి అర్జున్, అప్సర, చంద్రశేఖర్, రైసుద్దీన్, అజీం, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోషకాహారం అందించాలి



మల్యాల: ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపర్‌వైజర్ రాజశ్రీ

మల్యాల: పిల్లలకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–11లో బుధవారం పోషకాహారంపె అవగాహన కల్పించారు.

కొడిమ్యాల: మండలంలోని కోనాపూర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని రేగుంటలో పోషణ పక్వాడపై అవగాహన కల్పించారు.

గొల్లపల్లి: మండలంలోని అగ్గిమల్ల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జగిత్యాల జిల్లా:
9951602934, 9000308905
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
జగిత్యాల: రాజమల్లేశ్ - 9392460005
ధర్మపురి: వెంకటేష్ - 8008019205
కోరుట్ల: సురేశ్ - 7997958210
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899